

## అనగనగా... ఒక కథ

# లేత మనసు

"ఏవండీ లేవరా? ఎనిమిదయింది.." భర్త మీద సుమతి అరుపు.

"ఎంతసేపు తోముతావే? పిల్లాడు స్కూల్కెళ్లాలి.. నిక్కినీల్గి ఏడు దాటాక వచ్చావు.." ఇంకో అరుపు.

"ఈ వెధవ సిలిండరొకటి షడెన్గా చేతులెత్తేస్తోంది. దీనికో రెగ్యులేటర్... దాన్నింకో సిలిండర్కి మార్చడం.. ఇదో గోల. వెధవ తయారీ వీళ్లూనూ. సిలిండర్ బరువెక్కువ. ఆ బరువు కోసం లోపల సిమెంట్ చేస్తారేమో?

గ్యాసిండస్ట్రీపై అక్కసు-

"ఓరి.. మొద్దు వెధవా త్వరగా పాలు త్రాగి.. బ్యాగు సర్దుకుని ఏడవరా. టైమౌతోంది"

సుమతి గాలి పిల్లాడి వైపు-

దేవుడిచ్చిన గొంతునీ- ఎనర్జీనీ ఎవర్నో తిట్టడానికే వినియోగిస్తుంది సుమతి.

నాలుగవ క్లాసు చదువుతున్న పిల్లవాడయినా అమ్మ అందరిమీద అలా అరుస్తుండటం రామూకి ఇష్టం ఉండదు.

నిజమే! ఆ తల్లి "రామూ...నాన్నా... బంగారు తండ్రీ..." అని ఎక్కువసార్లు పిలిచిన దాఖలాల్లేవు. ఎప్పుడూ కోపంగా అరవడమే.

మళ్లీ తిట్టింది. "నాన్నకి తగ్గ కొడుకు.. ఒక్క పనిలో చురుకు లేదు. వెధవ పోలికలెలా వస్తాయో?"

తండ్రిని కూడా తిడుతున్నందుకు రాముకు వళ్లు మండిపోయింది.

'ఫట్'మని గ్లాసు విసిరికొట్టాడు.

అది వెళ్లి..వెళ్లి.. గాజు ఫ్లవర్వాజ్ మీద కసి తీర్చుకుంది.

ఫ్లవర్వాజ్ భళ్లున అరిచి ముక్కముక్కలుగా నేల కొరిగింది.

సుమతి పరుగెట్టుకొచ్చింది.

రామూ చెంప ఛెళ్లుమంటుందో వెన్ను ఫెళ్లుమంటుందో కంగారుగా ఉన్నాడు.

చిత్రం..!! వాళ్లమ్మ ఏమనలేదు.

అందుక్కారణం లేకపోలేదు.

ఆ ఫ్లవర్వాజ్ తన అత్తగారు తీర్థయాత్రల్నుంచి వచ్చేప్పుడు తెచ్చిన కానుక.

అది ఎవరికైనా పెళ్లి గిఫ్ట్గా ఇచ్చేద్దామని రెండు మూడుసార్లు ట్రై చేసింది గానీ.. భర్త "పోన్లేవే! అమ్మ పాపం సర్దాపడి తెచ్చింది కదా!" అని కూలర్మీద షోగ్గా పెట్టాడు.

హాల్లో ఎదురుగుండా దాన్ని చూసినప్పుడల్లా... అత్తగారి మొహం గుర్తొచ్చి చిన్నగా చిరాకుండేది.

నిజానికి సుమతి అత్తగారు సినిమాల్లో సూర్యాకాంతం కాదు... సర్దుకుపోయే రకం... సర్దిచెప్పే రకం.

కానీ.. కొడుకు మీద గారాబంతో "ఆనపకాయ కూరలో అల్లం వేస్తే వాడికిష్టమే అమ్మా! వంకాయ కొత్తిమీర, కారం పెట్టి వండు. వాడికి నచ్చుతుంది" అని డైరెక్షన్ ఇచ్చేసి ఇంటికి ఇంకా యజమానిగా ఉందామని అత్తగారు ట్రై చేస్తున్నప్పుడు ఆవిడ మాటలు సుమతికి రుచించలేదు.

పెళ్లయి పన్నెండేళ్లయినా, తొమ్మిదేళ్ల పిల్లాడ్ని సాకి...పెంచుతున్నా ఆవిడొచ్చేప్పటికి మొగుడు... ఆరేళ్ల పిల్లాడిలా బిహేవ్ చేస్తూ "అమ్మా...అమ్మా.." అంటూ కొంగట్టుకు తిరుగుతున్నట్టు కనిపిస్తున్నప్పుడు కాస్తంత చిరాకు పెద్దదయింది.

అనవసరంగా ఆవిడ కలిగించుకుంటోందని కోడలభిప్రాయమైతే, కోడలు పిల్ల అబ్బాయి ఇష్టాలు గమనించి ఎందుకు సహచర్యం చెయ్యదని అత్తగారి అభిప్రాయం.

అందుకే ఆవిడన్నా... ఆవిడిచ్చిన గిఫ్టలన్నా, ఆ...ఖరికి ఆవిడ నవ్వుతూ మాట్లాడుతున్నా సుమతికి ఓవర్గానూ, కృతకంగానే అన్పిస్తుంది.

తన మొగుడికి, పిల్లలకి తనుకాక ఇంకొహత్తెవ్వత్తి వచ్చి చేస్తుందని... ఒకటి రెండుసార్లు దురుసుగా అనేసింది కూడా.

"ఇంకొహత్తిని తెమ్మంటావా?" అని మొగుడు పరాచికంగా హెచ్చరించాక.. ఆ డైలాగ్ అన్లేదు గానీ ఆ మూడ్ మారలేదు.

ఇప్పుడు ఆవిడిచ్చిన ఫ్లవర్వాజ్ 'భళ్లు'మన్నాక కొడుకు మీద కోపం రాలేదు సుమతికి.

పెరట్లో పనమ్మాయిని 'క్షయ్యి'న కేకేసింది "లలితా" అని.

మొగుడు లేవకుండా తొందరగా... కిందున్న గాజుముక్కలు కూడా గప్చిప్గా మాయం చెయ్యాలని ఆర్డరేసింది.

పనమ్మాయి సుమతి కేకలకి హడావుడిగా వచ్చి అంతకన్నా హడావుడిగా చీపురు తెచ్చి గాజుముక్కలు ఊడ్చేసే పనిలో పడింది.

లలిత పనమ్మాయి కాదు. పని 'పిల్లే'!

13 ఏళ్లే ఉంటాయి. పీలగా ఉంటుంది. కానీ ఓపికలో, ఓర్పులో సుమతి కన్నా ఎక్కువే.

రాము చూస్తున్నాడు.. తను చేసింది తప్పే. తనకి తెల్సు. భయపడుతున్నాడు.

కానీ అమ్మెందుకు కోప్పడలేదూ...అర్థమౌతోంది.

అది బామ్మ ఇచ్చింది కదా! బామ్మంటే ఎందుకు కోపమో కూడా రాముకు తెలియదు.

అవునూ.... పెద్దవాళ్లపైనా... పేదవాళ్లపైనా చాలా మందికి అనవసరమైన కోపం వస్తుంది.

"సరిగ్గా తుడువ్... ఓసినీ మొహంమండ...గాజు ముక్కల్లో చూసుకుని అడుగెయ్యొద్దూ" సుమతి గయ్యిమంటుంది. లలిత కాలుని కస్సున కాటేసింది ఓ గాజుపెంకు. రక్తం ముద్దల్తో... నేల నిండుతోంది.

రాముగాడి కళ్లు చెమ్మగిల్లాయి.

నెత్తురోడుతున్న లలిత కాలు చూసి-

సుమతి మళ్లీ నోరు చేసుకుంటోంది.

"వెర్రి పీనుగా... చూసి అడుగెయ్యక్కర్లేదా? ఆ గాజు పిడత పగిలిందని నిన్ను పిల్చాను. ఓసి.... తిక్క మొహమా... ఆ రక్తం నేలంతా అవుతోందే. నేనేదో

**తండ్రి అప్పుడప్పుడు అంటారు.. "అమ్మంటే లక్ష్మీసరస్వతీ అన్నపూర్ణే కాదురా... మహంకాళీ, భద్రకాళీ కూడా ఉంటారు. అంటే అమ్మే... ఎప్పుడు అనుగ్రహిస్తుందో... ఎందుకు ఆగ్రహిస్తుందో... మనం చెప్పలేమురా.." అంటూ తరచుగా తండ్రి భార్యమీద జోకులేస్తుండే వాడు. రాముకి కొంత అర్థమయ్యేది. కొంత అర్థం అయ్యేది కాదు.**

మర్డర్ చేశాననుకుంటారు.”

సుమతి... అరుస్తోంది.


రాముకి తనే మర్డర్ చేసినట్టనిపిస్తోంది.

‘ఆ గాజుపెంకు నా కాలుకు గుచ్చుకుంటే తనయితే ఏడుస్తూ ఇల్లంతా ఎగిరేవాడు. కానీ, ఉన్న చోట్నుండి కదలకుండా రక్తం కారుస్తూ, నెప్పిని ఓరుస్తూ నిలబడ్డ లలితని చూసి.. కళ్లల్లో నీళ్లు తిరిగాయి రాముకి.

“ఆ రక్తం మరకలు కూడా తుడిచేది లలితే కదమ్మా” అందామనుకున్నాడు గానీ అంటే ఏమవుతుందో వాడికి తెల్సు.

అమ్మ నోరుకి నాన్నా తనూ బామ్మా, పనమ్మాయి అందరం అలవాటు పడిపోయాం అనుకున్నాడు.

‘అమ్మ గయ్యాళి కాదు.. రాక్షసి కాదు.. అమ్మ అమ్మేగానీ.. అప్పుడప్పుడూ అమ్మలో అమ్మను చూడలేకపోతున్నా..’ అని ఆ పసివాడికి తెల్సిపోయేది.



తండ్రి అప్పుడప్పుడు అంటారు.. “అమ్మంటే లక్ష్మీసరస్వతీ అన్నపూర్ణే కాదురా... మహంకాళీ, భద్రకాళీ కూడా ఉంటారు. అంటే అమ్మే... ఎప్పుడు అనుగ్రహిస్తుందో... ఎందుకు ఆగ్రహిస్తుందో... మనం చెప్పలేమురా..” అంటూ తరచుగా తండ్రి భార్యమీద జోకులేస్తుండే వాడు. రాముకి కొంత అర్థమయ్యేది. కొంత అర్థం అయ్యేది కాదు.

అందుకే ఏం మాట్లాడలేదు.

రాము వ్యక్తావ్యక్త పరిస్థితిలో... అవ్యక్త మనఃస్థితిలో ఉన్నాడు.

రెండ్రోజులు గడిచాయి.

లలిత కాలికి బాగానే గాయం అయ్యింది.

పసుపు రాసింది. కారం మెత్తిందట. గుడ్డ కట్టింది. నడవలేక నడుస్తూనే అరవ చాకిరీ చేస్తోంది.

లలిత నడుస్తున్న ప్రతీ అడుగూ... చిన్న పిల్లాడైన రామూ గుండెల్లో కలుక్కుమంటోంది.

ఆ అమ్మాయి కాలు నేల మోపుతుంటే ఆ నొప్పి తనకే కలిగినట్టనిపిస్తోంది.

తనేం చేయగలడు?

అవును... ఏం చేయగలడు?

నాన్నని అర్జెంటుగా యాభై రూపాయలు అడిగాడు రాము. “ఎందుకు” అన్నాడు తండ్రి.

“ఇప్పుడు అడగొద్దు నాన్నా... ఖర్చేం పెట్టానో నీకు చెప్తా!”

కొడుకులో నిజాయితీని శంకించలేదు. డబ్బులిచ్చేడు ఏం చేస్తాడో అని చిన్న అనుమానం ఉన్నా..

ఆ డబ్బుల్తో రాము లలితకి చెప్పులు కొని ఇచ్చాడు. “ఇవీ నువ్వే కొనుక్కున్నావని మా అమ్మ అడిగితే చెప్పు...”

లలిత భయపడింది తీసుకోవడానికి.

రాము భయపడలేదు. “నిజం చెప్పడానికి భయపడాలి కానీ అబద్ధం చెప్పడానికి.. మంచి పనికోసం అబద్ధం చెప్పడానికి... అస్సలు భయపడక్కర్లేదు” అనుకున్నాడు రాము.

చెప్పులేసుకుని లలిత ఇంట్లోకి రావడానికి అమ్మ ఒప్పుకోదేమో కానీ డాక్టరు చెప్పేడని చెబితే ఏ ఇబ్బంది ఉండదు అనుకున్నాడు.

చెప్పులు లేకపోతే ఐదు రోజులు నడవకూడదని డాక్టరు చెప్పినట్టు రాము లలితకి సలహా చెప్పాడు.

ఐదు పదయింది.. పది పదుహేను అయింది.. లలిత గాయం మానింది.

రాము చేసిన పనికి తండ్రికి కూడా తృప్తి కల్గింది.

*